# పులి మేక ఆట

ఒకానొక రాష్ట్రీ ముఖ్య పట్టణంలో ఉగాదినాడొక విందు జరుగుతోంది. ఆ విందుకు మంత్రులూ, సామంతులూ అనేకమంది విచ్చేశారు. వారిలో మహిళలూ, శ్రీమంతులూ, 'అతి' భాషులూ, 'మిత' భాషులూం గూడా వుంటారు కాబట్టి వున్నారు. అందరూ విందుకని ఆసీనులయ్యారు. తరువాతి కథాక్రమంలో యీ క్రింది సంభాషణ వినవచ్చింది :

"మీ తండే దీ వూళ్లోనే నాండీ?"

"ఔనండి"

"ఎప్పట్నుంచుంటున్నారిక్కడ?"

"ఆ రేళ్ళవుతుంది."

"ఆ రేళ్ళంటే యేంవుంది లెండి! మా వారిక్కడకొచ్చి దా దాపొక పాతికేళ్ళన్నా ఔతుంది."

"ఐతే, యీ పట్టణంవంతా కొట్టిన పిండై వుండాలి."

"పిండివంటలు గూడా బాగానే లొట్టలేసుకుంటూ తింటారు వారు. అందులోనూ, చాలాకాలం బ్రహ్మచారిగా వున్నారేమోం, పొరుగింటి పుల్లకూరగూడా రుచేవారికి."

"అదుగో, అక్కడ యెదురుగా కూర్చున్నవారేనా మీ వారు?"

"అంతమాత్రం గూడానా. ఆయనెవరో మంత్రిగారై వుంటారు. మా వారు ఉత్తర ప్రదేశస్థులు."

"ఓ, అలాగా. అందులోనూ గఢవాలీ వారైతే యీ పాటికి యెండలికి నల్ల కప్పేసుండాలి. చెట్టూ చేమా లేని నల్లరాళ్ల కొండలాగా."

"మా వారలాగాడు. అదిగో ఆ ప్రక్కన పండు నిమ్మ పండు మల్లే వున్నారే, వారు. అప్పుడప్పుడు ఆస్థ్మా వస్తూం టుంది వారికి. టెన్నిస్ ఆడతారు. నేను దగ్గర లేనప్పుడు పిల్లికళ్ళ ఆడవాళ్ళంటే మోజు చూపిస్తారు గూడాను."

"మీరు చాలా గొప్ప పరిశీలకుల్లా వున్నారు; 'అతి' భాషులుకూడా కాదు."

"ఎవరి భర్తల్ని గురించి వాళ్ళా మాత్రమైనా పరి శీలన చెయ్యకపోతే ఎలా లెండి! ఆ మాటకొస్తే అందరు మగవాళ్లూ అంతే."

"ఆస్కార్ వైల్డు పుస్తకాలు బాగా చదివినట్లున్నారు మీరు."

"చదవలేదని అనను గాని, మొత్తాని కది నిజంకూడా కదండీ?"

"ఐతే, మీ వారికి మోసమే వృత్తై పోయిందం టారా?"

"ఆ మాట అంత వయసొచ్చి నాయన్ని గురించి ఎలా గంటాను కానీండి, నలుగురు ఆడవాళ్ళతో కలసి మెలసి

మాట్లాడడమంటే సరదా పడతారు; అంతే. చూడండి! ఆ ప్రక్కనున్న మహారాష్ట్ర బ్రాహ్మణావిడతో ఎలా మాట్లాడు తున్నారో. ఆవిడగూడా ఆ రాగిజుట్టూ, పిల్లి కళ్లూ...చీర కట్టుకోకపోతే అచ్చంగా యింగ్లీషు లేడీలాగా వుంటుంది కదండీ."

"తెల్లవాళ్ళు తెల్లవాళ్ళంటారుగాని, మన నల్లవాళ్ళ ముందా తెల్లవాళ్ళెందుకు పనికొస్తారండీ. అరేబియా ఆడ వాళ్ల ముందు ఒంటెల్లాగా."

"ఏమిటో నా ఊహ కందని మాటలాడుతున్నారు మీరు; విందు భోజనంలో తారసిలినపుడు కాస్త స్త్రీలంటే గుర్రందిగి మాట్లాడాలి మరి."

"మా దేశంలో మొల్లలున్నారు. మీ దేశంలో మీరాబాయి, మహాదేవివర్మ, శివరాణిదేవీ వున్నారు. వారితోగూడా గుర్రందిగే మాట్లాడమంటారా?"

"వారు మాలాగా భర్తలమీద ఆధారపడేవారు కాదు గదా మరి."

"నిజవేఁ ననుకోండి. మీరుగూడా అంత గొప్పవారూ నని నా అభిప్రాయం...అందులోనూ ఏ నౌకాభంగమో జరిగి, ఏ ఎడారికో ద్వీపానికో చేరుకుంటే మీలాంటి వారొక్క రుంటే చాలు ప్రొద్దు పుచ్చేందుకు."

"మీ మాటలు వింటూంటే సిగ్గేస్తోంది నాకు. మా వారలాంటి మాటలన్న పాపానే పోరు. మీ రెప్పుడైనా

నౌకాదళంలో పనిచేశారా? చాలా ఒంటరి బ్రతుకట గదూ అది...సరే గాని, మా క్లబ్బా అంతే. ఎప్పుడూ, ఎవరూ వుండరు సంతోషంగా బాతాఖానీ కొట్టుకోడానికి."

"మధ్య మధ్య ఎవరో ఒకరు ఏ పుస్తకానికనో రాకనూ మానరు; ఏకాంతం భంగం కాకనూ మానదు."

"అన్నట్లా ఏకాంతపు ఎడారిలో చేయడాని కేముం టుంది?"

"చదరంగం ఆడుకోవచ్చును; పులీ మేకా ఆడుకో వచ్చును."

"పులీ మేకా ఆట చేతగాదుకాని నాకు, చదరంగం ప్రయత్నంచేస్తే అడగలననుకుంటా."

"పోనీ, చదరంగవే ఆడుకుందాం."

"ఆడుకు నాడుకుని అలసిపోతే?"

"చుక్కల్ని లెక్కిస్తూ కూర్చుందాం."

"పగలు?"

"మీరు కుట్టు పని చేసుకుందురు గాని, నేను నిద్ర పోతాను."

"కుట్టుకోడానికి ఊలు దొరకొద్దండీ ఎడారిలో? అక్క డేదో కో ఆపరేటివ్ స్టోరున్నట్లు మాట్లాడ్తారేమిటి?"

"మీరు తొడుక్కున్న జాకెట్టు ఊలుదే గదండీ. నా

కళ్ళజోడు కొమ్ముల్ని విరగ్గొడితే ఊలు కుట్టు సూదు లౌతాయి!"

"నా జాకెట్టులో వూలెన్ని రోజులొస్తుంది కుట్ట డానికి !"

"మీరు తొడుక్కున్న జాకెట్టు ఊలూడదీసి గాదు నేను కుట్టమనేది; మరో కొత్త జాకెట్టే కుట్టుకోండి."

"మీరు చూపే ఎడారికలలు చాలా గొప్పగా వున్నా యండీ. ఆ మనోహర దృశ్యం కళ్లకట్టినట్లు కన్పిస్తోంది... మీ ఫోన్ నంబరు చెప్పారుగాదు..."

"తప్పకుండా యిస్తానండి, వెళ్ళేముందు."

"ఇదిగో చూడండి; మా కవతల వైపున కూర్చు న్నమ్మాయితో గూడ మాట్లాడండి మరి కాస్సేపు. మంచ మ్మాయి ఆ అమ్మాయి. మరీ యెవరూ మాట్లాడనట్లుంది ఆ అమ్మాయితో. యీ లోపుగా నేను నా కుడిచేతివైపున కూర్చున్నాయనతో మాట్లాడ్తాను. ఈ మధ్యనే యినుప రాయి వ్యాపారంలో లక్షలు సంపాదించాడటాయన.

* * *

"మీ రుండేదీ వూళ్లోనా నాండీ?"

"ఔనండి."

"చాలా కాలమైందా మీ రిక్కడికొచ్చి,"

"ఔనండి."

"మరీ యెండలు మాడ్చేస్తున్నాయండీ."

"నిజవేఁ నండీ."

"మరీ మొన్న గురువారం దుమ్ము రేగ్గొట్టిందండీ వర్షం."

"ఔనండి."

"జీపేసు కెళుతున్న కంట్రాక్ట రొకరు జీపుతోపాటు ఎగెరి పడ్డాడండీ ఆ గాలివానకి."

"నిజంగానే!"

"విందేర్పాట్లు బాగానే వున్నాయ్ గదండీ"

"బాగానే వున్నయ్యండి"

"కోడి పలావంటే మహా యిష్టం నాకు; మీకూ..."

"యిష్టవేఁనండి"

"మీకు ఏకాంతపు ఎడారులంటే సరదాయే నాండీ"

"ఏఁ వన్నారూ?"

"ఎడారి"

"నాకా ఆలోచనే రాలేదండీ ఎప్పుడూను."

"నాస్నేహితురాలొకావిడ బలవంతం చేస్తోంది వెళ్దామని. రెండు మూడు రోజుల్లో వెళ్దాఁవని చూస్తున్నా. ఆ ఎడారి నిండా మల్లెదోటలూ, మొగలి పొదలున్నా..."

"చాలా బావుంటుందాండీ"

"ఉహఁ! అక్కడి కెళ్ళి పులీ మేకా ఆట ఆడుకుంటాం మేం. రాత్రిళ్లు వెల్లకిలా పండుకొని చుక్కల్ని లెక్కించు కుంటాం"

"బలే రొమాంటిగ్గా వుంటుందండీ అట్లా ఐతే"

"మీకు రొమాన్సంటే బాగా యిష్టమా?"

"అనుభవించ లేదండి."

"నిజవేఁ? మరి పులీ మేక ఆట?"

"మా తాతగారు నేర్పారు నాకు నాలుగేళ్లప్పుడు."

—:o:—